సాక్షి
మహబూబాబాద్
శనివారం । 25 । జనవరి । 2025



భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలి - 10లో▸

మేడారం సమ్మక్క, సాలరమ్మ మినీ జాతరలో భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.



గుంతలమయంగా రోడ్లు

మానుకోట పట్టణంలో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. కాలనీలరోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - 11లో▸

గరిష్టం/కనిష్టం
35.6⁰/14.9⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

28న మెగా జాబ్‌మేళా



మహబూబాబాద్ అర్బన్: ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో మానుకోట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న ఉదయం 10:30గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి గుగులోత్ దేశీరాంనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఏఎస్ఎం, జీఎస్ఎం, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ కోర్సులు పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ బయోడేటా, విద్యార్హతలు జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 80089 32159, 79816 33716 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్: జిల్లాలోని దివ్యాంగులు స్వయం ఉపాధి పథకం యూనిట్ల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీడబ్ల్యూఓ దనమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను నాన్ బ్యాంక్ లింకేజీ కింద మండలానికి ఒకటి, మున్సిపాలిటీకి ఒక యూనిట్ చొప్పున మొత్తం 21 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. యూనిట్‌కు రూ.50,000 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆసక్తి, అర్హత గల వారు ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలం అయితే మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపాలిటీ అయితే మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 91334 15312, 91772 60816 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యాసంస్థల్లో ప్రవేశాలకు..

మహబూబాబాద్ అర్బన్: సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలు, కళాశాలలతో పాటు రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మల్టీజోన్ ఆఫీసర్ కె.అలివేలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. అలాగే 6 నుంచి 10, ఇంటర్‌లో మిగిలిన ఖాళీ సీట్లలో ప్రవేశాలకు కూడా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు టెండర్లు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు మహాశివరాత్రి నుంచి జరగనుండడంతో ఆలయంలో వివిధ ఏర్పాట్ల కోసం శుక్రవారం ఆలయ ఆవరణలో టెండర్లు నిర్వహించారు. ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తల సమక్షంలో తక్కువ కోట్ చేసిన టెండర్లు ఓపెన్ చేశారు. తడకల పందిర్లు వేయడం కోసం రూ.1,87,500, బారికేడింగ్, క్యూలైన్‌ల కోసం రూ.85వేలు, విద్యుత్‌దీపాల అలంకరణ రూ.4.25లక్షలు, ఆలయం, కల్యాణ మండపానికి పూల అలంకరణ రూ.1.85లక్షలు, ఆలయానికి రంగులు వేసేందుకు రూ.2.25లక్షలు, కల్యాణ వేడుకల ప్రత్యక్ష ప్రసారాల ఎల్ఈడీల ఏర్పాటుకు రూ.1.85లక్షలు, రంగులు, సున్నాలు సప్లై చేసేందుకు కురవి అనురాధ ఏజెన్సీస్ రూ.4,83,660, కలకత్తా పెండ్యాలు వేసేందుకు రూ.4లక్షలు, తెప్పోత్సవ పూల అంకరణకు రూ.70వేలు, తెప్పోత్సవ విద్యుత్ దీపాలంకరణకు రూ.53వేలు, కల్యాణమండపంలో బారికేడింగ్, క్యూలైన్‌ల ఏర్పాటును రూ.1.70 లక్షలకు టెండర్ల ద్వారా దక్కించుకున్నారు.

ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కంప్యూటర్ సైన్స్‌విభాగం కేంద్రంలో పరీక్షల తీరుతెన్నులను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసింఇక్బాల్, విభాగం అధిపతి డాక్టర్ రమ పరిశీలించారు.


నేటినుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్ఎం ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) శనివారం నుంచి జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సౌజన్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 25, 27, 29, 31, ఫిబ్రవరి 3, 5 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 26 సెంటర్లను ఏర్పాటుచేయగా, 4,770 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

పర్యాటక ఓరుగల్లు

ఆధ్యాత్మిక.. ఆహ్లాద విహారం..

నేడు పర్యాటక దినోత్సవం



ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాస్త విరామం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఏదైనా యాత్రకు వెళ్లాలంటే నాలుగైదు రోజుల సమయం కావాలి. ఖర్చు అధికంగానే ఉంటుంది. పిల్లలకు సెలవులు ఉండాలి. ఇవన్నీ సంవత్సరానికి ఒకసారే వీలవుతాయి. ఒకటి రెండు రోజులు సెలవులు దొరికినా చూసేందుకు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు మన దగ్గరే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయిస్తంభాలు,భద్రకాళి దేవాలయాలు, మేడారం, రామప్ప, మంగపేట హేమాచలక్షేత్రం, ఆహ్లాదప్రాంతాలైన ఖిలావరంగల్ కోట, జూపార్క్, లక్నవరం, బొగత, బ్లాక్‌బెర్రీ తదితర ప్రాంతాలున్నాయి. నేడు(శనివారం) జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను ఒకసారి చుట్టివద్దాం..

- పూర్తి వివరాలు 10లో▸





ఖాకీల్లో కలవరం

వరుస సంఘటనలతో బెంబేలు

- మరికొందరిపై వేటు పడే అవకాశం ఉందని ప్రచారం
- ఎప్పుడేం జరుగుతుందో అని అధికారుల్లో భయం

సాక్షి, మహబూబాబాద్: జిల్లా పోలీస్‌శాఖలోని పలువురు అవినీతిపరులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. ఇటీవల జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనం. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని శాఖకు చెందిన పలువురు అధికారులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. కాగా కొద్దిరోజుల క్రితం తొర్రూరు సీఐపై ఏసీబీ కేసు నమోదు కాగా.. ఇటీవల ఎవరూ ఊహించని విధంగా గూడూరు సీఐని హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేసి.. ఆయన స్థానంలో కొత్త సీఐని నియమించారు. దీంతో ఇప్పటికే పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితోపాటు, మరికొందరు అధికారుల్లో కలవరం మొదలైందని ఆశాఖలో ప్రచారం జరుగుతోంది.



పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చ

జిల్లాలో కీలక బాధ్యతలు చేపట్టిన అధికారి, ఎస్పీ కార్యాలయంలో పనిచేసిన కిందిస్థాయి ఉద్యోగి కలిసి పెద్దసార్ల పేర్లు చెప్పి డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లా అధికారులు విచారణ జరిపి సదరు అధికారిని వేరే జిల్లాకు బదిలీ చేసిన విషయం అప్పట్లో చర్చగా మారింది. జిల్లాలోని ఓ విభాగంలో పనిచేస్తున్న అధికారి అక్రమ వ్యాపారులతో కుమ్మక్కై తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు అధికారిపై బదిలీ వేటు వేసినట్లు ప్రచారం జరిగింది. అలాగే ఓ స్టేషన్‌లో పనిచేసిన అధికారి ఉన్నతాధికారికి మర్యాద ఇవ్వకపోవడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు, ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహించారనే ఆరోపణలతో ఇతర జిల్లాకు బదిలీ చేశారు. రోడ్డు ప్రమాదం కేసులో ఒక వాహన డ్రైవర్‌కు బదులు మరో డ్రైవర్ పేరుతో ఎఫ్ఐఆర్ చేశారనే ఆరోపణలతో సదరు అధికారిపై బదిలీ వేటుతోపాటు, సస్పెండ్ కూడా చేసినట్లు సమాచారం. అదేవిధంగా ఓ అధికారి బియ్యం, బెల్లం అక్రమ రవాణాదారుల నుంచి ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో సదరు అధికారిని ముందు లూప్‌లైన్‌కు బదిలీ చేశారని ప్రచారం జరిగింది. ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు తీసుకున్నారని ఒక అధికారిని బదిలీ చేయడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అదేవిధంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో భారీ మొత్తంలో బేరం కుదుర్చుకొని కొంత తీసుకొని మిగిలిన అమౌంట్ కోసం బెదిరించిన ఆరోపణల నేపథ్యంలో తొర్రూరు సీఐ జగదీశ్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం జిల్లాలో సంచలనం రేపింది. ఇది మరిచిపోక ముందే గూడూరు సీఐ బాబూరావును బదిలీ చేసి ఆయన స్థానంలో సూర్యప్రకాశ్‌ను నియమించిన విషయంపై పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సీఐ బదిలీ సాధారణ బదిలీ అని అధికారులు చెబుతుండగా.. రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకే ఆయనను బదిలీ చేసినట్లు గూడూరు సర్కిల్‌లో చర్చ.

అధికారుల్లో ఆందోళన

జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని జిల్లాలోని కొందరు అధికారుల్లో ఆందోళన మొదలైనట్లు ప్రచారం. ప్రధానంగా బియ్యం, బెల్లం, ఇసుక అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లో పనిచేసే వారిపై ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా సివిల్ వ్యవహారాల్లో తలదూర్చడం, స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించకుండా పెద్ద మనుషుల పంచాయితీలను ప్రోత్సహించడం వంటి సంఘటనలు జరుగుతున్నట్లు ప్రచారం. అయితే తెలంగాణ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాల సేకరణ కోసం క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తూ... స్కానర్లు ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో అందుబాటులో ఉంచారు. వీటిని వినియోగించి ఎవరు ఎవరిపై ఫిర్యాదు చేస్తారో.. అవి ఎటు దారి తీస్తాయో అనే భయం కూడా పట్టుకుందని ప్రచారం.

వేతనాలు పెండింగ్..

- మానుకోట మున్సిపాలిటీలో మూడు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన



మానుకోట మున్సిపాలిటీ కార్యాలయం
మూడు నెలల వేతనాలు పెండింగ్..

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు జీతాలు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు రాక అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే కొద్దిపాటి వేతనాలు నెలనెలా అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని వాపోతున్నారు.



203 మంది ఉద్యోగుల సమస్య

మానుకోట మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు, 25,000లకు పైగా గృహాలు ఉన్నాయి. కాగా మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్‌లో 203 మంది పని చేస్తున్నారు. వారిలో 143 మందిని పారిశుద్ధ్య కార్మికులుగా ఉపయోగించుకుంటుండగా.. మిగిలిన వారిని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం, వాటర్‌సప్లై, కంప్యూటర్ ఆపరేటర్లుగా వివిధ పనులకు ఉపయోగించుకుంటున్నారు. కాగా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సిబ్బందిని పెంచాలని సీడీఎంఏను పలుమార్లు కలిసినా ఫలితం లేకపోయింది. దీనికితోడు వేతనాలు సక్రమంగా రాకపోవడం అధికారులకు కూడా తలనొప్పిగా మారింది.

మున్సిపాలిటీలో 203 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గాను ప్రతీనెల జనరల్‌ఫండ్ నుంచి రూ.40 లక్షలు కేటాయిస్తున్నామని, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాలకు చెందిన వేతనాల బిల్లులు ఎస్టీఓకు పంపించినట్లు అధికారులు తెలిపారు. రూ.1.25కోట్లు ప్రభుత్వ ఖాతాలో వేశారు. గతంలో ఎస్టీఓ నుంచి బ్యాంక్‌లో జమ అయ్యేవి. కానీ గత రెండు సంవత్సరాల నుంచి ఎస్టీఓ నుంచి ఈ–కుబేర్‌కు వెళ్లి ఆ తర్వాత బ్యాంక్‌లో జమ అవుతున్నాయి. కాగా ఈ–కుబేర్‌లోనే మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రతీనెల వేతనాలు వేస్తున్నాం..

2024కు సంబంధించి అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు వేశాం. కానీ ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే ఆ ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి. ఈ కుబేర్ కాకుండా ఎస్టీఓ నుంచి బ్యాంక్‌కు జమ చేస్తే ఈ సమస్య ఉండదు. - లింగాల కుమార్, అకౌంటెంట్, మానుకోట మున్సిపాలిటీ

నిట్‌లో ద సేఫ్ సిస్టమ్‌పై చర్చ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిట్ వరంగల్, లండన్‌కు చెందిన స్వీడన్ లుండ్ యూనివర్సిటీలు రోడ్డు భద్రతపై ద సేఫ్ సిస్టమ్ పేరిట చర్చ నిర్వహించారు. భారతదేశంలోని రహదారుల అభివృద్ధికి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు రవిశంకర్, కేవీఆర్, రఘురామ్, లండన్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు అలియాక్సి లారేషిన్, కార్మెలో డి.అగోస్టినో పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్
- మానుకోట వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు, సద్దిమూట ప్రారంభం



సద్ది మూట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతుందని ప్రభుత్వ విప్ తేజావత్ రాంచంద్రునాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మిర్చి కొనుగోళ్లు, సద్దిమూట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానుకోట వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ.. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను రైతుల మేలుకోరి ప్రభుత్వం అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలందరికీ తప్పకుండా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని చెప్పారు. డోర్నకల్ రైల్వే జంక్షన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, మరిపెడలో వ్యవసాయ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మరోచోటుకు మార్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, ఏఎంసీ డైరెక్టర్లు అవుల కందయ్య, బాదావత్ బిక్కునాయక్, బండి శైలజ, బట్టు నర్సయ్య, సాదనాల వెంకటేశ్వర్లు, తేజావత్ వెంకన్న, దేశెట్టి మల్లయ్య, సయ్యద్ ఖాసిం, సంపంగి సులోచన, బానోత్ రాములు, వేమిశెట్టి యాకాంబ్రం, జంగాల నరసింహారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు

నెల్లికుదురు: అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాబితాల్లో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బందిలో మార్పు రావాలన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా సెషన్ కోర్టు జడ్జి సురేశ్
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



కురవి: బాలికలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా జడ్జి సురేశ్



తొర్రూరులోని కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న జడ్జి సరిత

కురవి: బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా సెషన్ కోర్టు జడ్జి సురేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నేరడ మోడల్ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన కల్పించారు. ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు చదువుతో పాటు సామాజిక అంశాల్లో రాణించాలన్నారు. పురుషులతో సమానంగా బాలికలు పోటీపడాలన్నారు. దేశంలో భ్రూణహత్యలు జరుగుతున్నాయని, వాటిని నివారించాల్సిన అవసరం ఉందని, బాలికలు అప్రమత్తంగా ఉండి సమాజంలో జరుగుతున్న చెడును పారదోలేందుకు కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలు ఆంక్షలను పక్కన పెట్టి చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కురవి ఎస్సై గంద్రాతి సతీష్, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రత అందరి బాధ్యత

తొర్రూరు: బాలికల భద్రత అందరి బాధ్యత అని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అన్ని విభాగాల్లో బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా నేటికీ వారిపై వివక్ష కొనసాగుతుందన్నారు. అవసరమైన సమయంలో చట్టాల సాయంతో కోర్టుల ద్వారా రక్షణ పొందాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ మణెమ్మ, ధర్మశ్రీ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ధరావత్ విమల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్



ఆలయ అభివృద్ధిపై సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేతవీరభద్రస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేజాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయానికి కావాల్సిన అవసరాలను గుర్తించి నివేదిక తయారు చేసి అందజేయాలని సూచించారు. గతంలో అభివృద్ధి పనులు ఎంత వరకు చేశారు? ఇంకా చేయాల్సిన పనులు ఏం ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలలో స్వామి వారి జాతర దృష్ట్యా వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కైలాసభవనం స్థానంలో గెస్ట్ హౌస్ నిర్మించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. జాతర ఆహ్వాన పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి ఇస్తామని వివరించారు. అభివృద్ధికి కావాల్సిన పనుల వివరాలను తయారు చేయాలని సూచించారు. సంతలో మరుగుదొడ్డి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, నాగేంద్రస్వామి ఆలయ ఆవరణను పరిశీలించారు. పలువురు అధికారులు, ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఈఓ సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రామునాయక్, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, భిక్షపతి, సంజీవరెడ్డి, శత్రునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, నియోజకవర్గ నాయకుడు పి.రఘువీర్‌రెడ్డి, నాయకులు అవిరె మోహన్‌రావు, బాదె వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని కాకతీయ జూపార్కుకు ఇటీవల వచ్చిన జంతువులతో కొత్తకళ సంతరించుకుంది. ఇప్పుడున్న చిరుతలు, ఎలుగుబంటి, మొసళ్లు, నెమళ్లు, జింకలు, ఆస్ట్రిచ్, కొండెంగలు, నక్కలు, పక్షులతో పాటు కొత్తగా తీసుకొచ్చిన రెండు పెద్దపులులు (శంకర్, కరీనా), అడవి దున్నలు, హగ్ డీర్, బార్‌కిన్ డీర్ (జింకలు) సందడి చేస్తున్నాయి. రాష్ట్రంలోనే హైదరాబాద్ జూపార్కు తర్వాత కాకతీయ జూపార్కు రెండో అతిపెద్దది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. మినీ జూపార్కుగా ఉన్న దీన్ని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో మీడియం జూపార్కుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్మార్ట్ సిటీ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నారు.
మూడేళ్లలో పార్కుకు వచ్చిన పర్యాటకులు, ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి.

సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	వచ్చిన ఆదాయం
2022 - 23	2,91,802	1,16,96,010
2023 - 24	2,48,187	1,14,96,685
2024 - 25 జనవరి	1,80,811	88,44,725

పర్యాటక ఓరుగల్లు

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాలు, సరస్సులు, జలపాతాలు ఉన్నాయి. వాటిని చూసేందుకు రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా ఉమ్మడి జిల్లా రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఈక్రమంలో సందర్శకుల నుంచి ఆదాయం సైతం వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి మరిన్ని సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తే పర్యాటకం పరుగులెత్తనుంది. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	ఆదాయం
2021 – 2022	68,645	రూ.20,20,500
2022 – 2023	57,281	రూ.22,92,160
2023 – 2024	61,873	రూ.24,73,665

పర్యాటకులను ఆకర్శిస్తున్న బొగత

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం పర్యాటకులను ఆకర్శిస్తోంది. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గుట్టల మధ్య దండకారణ్యంలో సుమారు 50 కిలో మీటర్ల దూరంలో నల్లందేవి గుట్ట వద్ద పుట్టి, అక్కడ నుంచి ప్రవహిస్తూ చీకుపల్లి గ్రామ సమీపంలో బండలపై నుంచి జాలువారుతూ పరవళ్లు తొక్కుతోంది. జూన్ 20 నుంచి నవంబర్ వరకు జలపాతం కనువిందు చేస్తుంది. బొగత భద్రాచలం నుంచి 123 కిలో మీటర్లు, ఖమ్మం నుంచి 243, వరంగల్ నుంచి 123 కిలో మీటర్లు ఉంటుంది.

కాకతీయుల కళానైపుణ్యానికి ప్రతీక వేయిస్తంభాల దేవాలయం

హన్మకొండ కల్చరల్: దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన వేయిస్తంభాల దేవాలయం వరంగల్‌కు 5 కిలోమీటర్ల దూరంలో హనుమకొండ నడిబొడ్డున ఉంది. చాళుక్యుల శైలిలో కాకతీయ వంశానికి చెందిన రుద్రదేవుడి పాలనలో నిర్మించారు. కాకతీయ సామ్రాజ్య కళాపిపాసకు, విశ్వబ్రాహ్మణ శిల్పుల పనితనానికి మచ్చుతునగా, భావితరాలకు వారసత్వంగా నిలుస్తోంది. కాకతీయుల శిల్పకళా శైలితో అలరారే ఈ త్రికుటాలయంలో నక్షత్రాకార పీఠంపై రుద్రేశ్వరుడు ప్రధాన అర్చమూర్తిగా లింగరూపంలో భక్తుల పాలిట కొంగు బంగారమై కొలువయ్యాడు. ప్రధానాలయం తూర్పునకు అభిముఖంగా అద్భుతమైన వాస్తుకళతో చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. ఆలయ మండపానికి ఉత్తరాభిముఖంలో నందీశ్వరుడి విగ్రహం నల్లరాతితో మలచబడి, కల్యాణ మండపానికి, ప్రధానాలయాలకు మధ్య దర్శనమిస్తోంది. మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి, గణేశ నవరాత్రుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది.

సంవత్సరం	ఆదాయం
2022 - 23	రూ.59,50,950
2023 - 24	రూ.64,81,550

అపురూప శిల్పకళా సంపద రామప్ప

వెంకటాపురం(ఎం): అపురూప శిల్పాకళా సంపదకు నిలయం.. ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం. వరంగల్ నుంచి సుమారు 65 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడి సైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రుడు 1213వ సంవత్సరంలో రామప్ప దేవాలయాన్ని నిర్మించాడు. దేవాలయంలో శివలింగాన్ని (రుద్రేశ్వరుడు, రామలింగేశ్వరస్వామి) ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఇసుకనే పునాదిగా వాడి ఆలయాన్ని నిర్మించగా, నీటిలో తేలాడే ఇటుకలతో ఆలయ గోపురాన్ని నిర్మించడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. గర్భగుడికి ఎదురుగా ఉన్న నందీశ్వరుడిలో జీవకళ ఉట్టిపడుతోంది.

సంవత్సరం	ఆదాయం
2021 – 22	రూ.27,56,770
2022 – 23	రూ.28,66,030
2023 – 24	రూ.35,54,532

ప్రకృతి ఒడిలో పాండవుల గుట్టలు


రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రావులపల్లి శివారులోని పాండవుల గుట్టల చుట్టూ పచ్చని పొలాలు, ప్రకృతి అందాలు, జాలువారే జలపాతాలు, ప్రాచీన కాలం నాటి రాతి చిత్రాలు పర్యాటకుల ఆహ్లాదానికి చిరునామాగా మారాయి. పాండవుల గుట్టలు ఎక్కువగా సున్నపు రాళ్లతో, అవక్షేప శిలలతో ఏర్పడి ఒకదాని మీద మరొకటి పేర్చినట్లు కనువిందు చేస్తున్నాయి. ఎత్తైన బండరాళ్ల మధ్యలో, లోతైన లోయలు, నిల్చున్న కొండ ఆనవాళ్లు కనిపిస్తాయి.

కళా వైభవానికి దర్పణం కోటగుళ్లు

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పర్యాటం వైపు పరుగులెత్తుతోంది. గణపురం మండల కేంద్రంలో కాకతీయుల కళా వైభవానికి దర్పణం పట్టేలా నిర్మించిన కోటగుళ్ల (గణపేశ్వరాలయం)తో పాటు గణపసముద్రం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి. 1199 – 1260 మధ్య కాలంలో గణపురం సామంతుడైన గణపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని గణపురం ఈశాన్యంలో మట్టి కోటల మధ్య నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా 16వ శతాబ్దం ప్రారంభంలో కులీకుతుబ్ ఉల్‌ముల్క్ అనే మహ్మదీయ రాజు ఈ ఆలయాన్ని ఫిరంగీలతో పేల్చి ధ్వంసంచేశాడు. 15 ఏళ్ల నుంచి నిత్య పూజలతో వెలుగులోకి వచ్చింది.

మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో రెండేళ్లకోసారి సమ్మక్క – సారలమ్మ మహాజాతరను పూజారులు ఘనంగా నిర్వహిస్తారు. ఏడాది మధ్యలో మినీ మేడారం జాతర జరుగుతుంది. 1996లో మేడారం గిరిజన జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. అప్పటి నుంచి మేడారానికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. సమ్మక్క – సారలమ్మ పూజారులు సంప్రదాయంగా అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తారు. మేడారానికి వచ్చే భక్తుల్లో చాలామంది అడవుల్లో చెట్ల కింద వంటావార్పు చేసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తారు. మేడారంలోని జంపన్నవాగు, చిలకలగుట్ట, సమ్మక్క జలధార, కంక వృక్షాలు భక్తులకు ఆకట్టుకుంటాయి. ఏటేటా మేడారానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. అమ్మవార్ల దర్శనానికి వచ్చేవారు విందు, వినోదాలతో సందడి చేస్తారు. అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది.



సంవత్సరం	ఆదాయం
2022 – 23	9,95,24,978
2023 – 24	11,32,16,239

పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న భద్రకాళి దేవాలయం

ఓరుగల్లులో కొలువైఉన్న భద్రకాళి ఆలయం అత్యంత ప్రాచీనమైంది. వరంగల్, హనుమకొండ మధ్యలో భద్రకాళి సరస్సు, దాని పక్కన ఎత్తైన కొండపై ఉన్న ఒక పురాతన దేవాలయం ఇది. క్రీస్తు శకం 625లో భద్రకాళి ఆలయం నిర్మించగా, దుర్గమమైన భద్రకాళి గుట్టల్లో ఏకాండ శిలలో వెలిసిన అమ్మవారు మాత్రం అంతకంటే పూర్వనుంచే ఉన్నారు. భద్రకాళి ఆలయాన్ని 1950లో పునరుద్ధరించారు. ఈ ఆలయాన్ని అత్యంత ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. ప్రతీ సంవత్సరం లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. కాకతీయ రాజులు భద్రకాళి దేవిని తమ పితృదేవతగా కొలిచేవారు. భద్రకాళి సరస్సును కాకతీయులే నిర్మించారు. అమ్మవారు తొమ్మిదడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పు, ఎనిమిది చేతులతో దర్శనమిస్తున్నారు. ప్రతిరోజు 100టోకెన్లు, శుక్రవారం, ఆదివారాల్లో 200టోకెన్లు భక్తులకు అందజేస్తారు.

సజీవ సాక్ష్యాలు కాకతీయ కట్టడాలు

ఖిలా వరంగల్: చారిత్రక కట్టడాలు.. ప్రకృతి సౌందర్యాలు.. ఆధ్యాత్మిక కేంద్రాల కలయికే ఓరుగల్లు నగరం. కాకతీయుల కళారాజ్యంలో నాటి అందమైన అద్భుత శిల్పకళా ఖండాలతో పాటు పచ్చని పల్లెటూరు వాతావరణం పర్యాటక శోభకు అద్దం పడుతోంది. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోట.. ప్రపంచ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. కాకతీయుల శకం ముగిసి 800 ఏళ్లు గడుస్తున్నా నేటికీ చారిత్రక కట్టడాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. కోటలో స్వయంభూ శంభులింగేశ్వర స్వామి, నాలుగు కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్, ఏకశిల గుట్టపై కట్టడాలు, శత్రుదుర్భేద్యమైన మట్టికోట, రాతికోటలు ఉన్నాయి. సుమారు రోజూ రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం వస్తోంది. ఏడాదికి సుమారు రూ.7లక్షలకు పైగా ఆదాయం సమకూరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాకాల అందాలు అదరహో

సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	ఆదాయం
2022	40,634	రూ.12,21,210
2023	41,297	రూ.17,95,470
2024	41,453	రూ.17,96,860

ఖానాపురం: పర్యాటక ప్రాంతాల్లో పాకాలకు ప్రత్యేక స్థానం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాకాలకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, ఖమ్మం, ఇతర ప్రాంతాలను నుంచి పర్యాటకులు నిత్యం తరలివస్తుంటారు. కట్టపై నుంచి సరస్సు అందాలతో పాటు జలసవ్వడిని ఆస్వాదిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాకాల సరస్సు మీదుగా సూర్యచంద్రుల ప్రతిబింబాలు పర్యాటకులను కనువిందు చేస్తుంటాయి. గతంలో బోటింగ్ నిలిచిపోగా ప్రస్తుతం బోటింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నైట్‌క్యాంపింగ్, వాచ్‌టవర్ల ఏర్పాటుతో పర్యాటకులు సరస్సు, పాకాల అందాలను వీక్షిస్తూ అద్భుతమంటూ కితాబిస్తున్నారు.

టూరిస్ట్ పిక్నిక్ స్పాట్ లక్నవరం

సంవత్సరం	పర్యాటకులు
2022	5 లక్షలు
2023	7 లక్షలు
2024	9 లక్షలు

గోవింద రావుపేట: ములుగు జిల్లా గోవింద రావుపేట మండలంలోని బుస్సాపూర్ గ్రామ సమీపంలో లక్నవరం సరస్సు ఉంది. ఇది ప్రసిద్ధిగాంచిన టూరిస్ట్ పిక్నిక్ ప్రదేశం. మూడు ఇరుకైన లోయలను సిమెంట్ కట్టడాలతో మూసివేయడం వలన ఈ సరస్సు ఏర్పడింది. ఈ సరస్సును 13వ శతాబ్దంలో కాకతీయ రాజవంశం పాలకులు నిర్మించారు. ఈ ప్రాంతం మొత్తం పచ్చని పంటలు, ఆహ్లాదకరమైన నీటి వనరులతో కళకళలాడుతూ ఉంటుంది. అదనపు ఆకర్షణగా సస్పెన్షన్ వంతెనలు నిర్మించారు. లక్నవరం సరస్సుకు వెళ్లే దారిలోనే అటవీ ఉద్యానవనం జింకల పార్కు ఉంది. ట్రెక్కింగ్ ద్వారా అడవిని చూడొచ్చు.

అందాల బ్లాక్ బెర్రీ ఐలాండ్

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఏటూరునాగారం వైపు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని జలగలంచ అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్ ఉంది. చుట్టూ దట్టమైన అటవీప్రాంతం మధ్యలో ఎడారిలా బ్లాక్ బెర్రీ ఐలాండ్ కొలువైంది. ఇసుక మేటలతో ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఐలాండ్ చుట్టూ వాగు ప్రవహిస్తోంది. బ్లాక్‌బెర్రీ దీవి ఐలాండ్ పర్యాటకులకు ఆకర్శిస్తోంది. పర్యాటకులు రాత్రి వేళలో బస చేసేందుకు 50 గుడారాలు ఏర్పాటు చేశారు. అలాగే, రెస్టారెంట్ కూడా ఉంది. రాత్రిపూట చలిమంటలు, సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు. ఐలాండ్‌ను మొత్తం వీక్షించేందుకు వాచ్ టవర్ కూడా ఉంది. బ్లాక్ బెర్రీ ఐలాండ్ సందర్శన కోసం ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించారు.

రెండో యాదగిరి గుట్ట.. హేమాచల క్షేత్రం

మంగపేట: అడవితల్లి ఒడిలో నెలవై రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచిన హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం 5వ శతాబ్దంలో ఏర్పడినట్లు చరిత్ర చెబుతోంది. ప్రకృతి ప్రసాదంగా వెలిసిన ఈ దైవక్షేత్రంలో స్వయంభూ లక్ష్మీనర్సింహుడిని దర్శించుకునేందుకు సమీప రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అంతటి విశిష్టత కలిగిన ఈ ఆలయం వరంగల్‌కు సుమారు 134 కిలోమీటర్ల దూరంలో ములుగు జిల్లా మల్లూరు గుట్టపై ఉంది. ఆరున్నర అడుగుల ఎత్తుగల స్వామివారి విగ్రహాన్ని గుహలో నుంచి తొలుస్తున్న క్రమంలో స్వామివారి నాభిలో గడ్డపార గుచ్చుకోగా, నాభి నుంచి నేటికీ చీము వంటి ద్రవం ప్రవిస్తోందని అర్చకులు చెబుతున్నారు. ఆ ద్రవాన్ని మంచి చందనంతో కలిపి నాభి చందన ప్రసాదంగా భక్తులకు ఇస్తుంటారు. ఆలయ సమీపంలో ప్రకృతి సిద్ధంగా వెలిసిన కోనేరు, చింతామణి జలపాతం ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీరుస్తోంది.

జేఈఈ మెయిన్స్‌కు 61మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం హనుమకొండ, వరంగల్‌లోని 5 పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లలో 61మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 1,221 మంది అభ్యర్థులకు 1,186 మంది హాజరుకాగా, రెండో సెషన్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన పరీక్షకు 1,085మంది అభ్యర్థులకు 1,059మంది అభ్యర్థులు హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ శ్రీలతారెడ్డి వివరించారు.

డ్రైవర్ వృత్తి గొప్పది

● ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను


డిపోలో డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఆర్ఎం డి.విజయభాను

హన్మకొండ: డ్రైవర్ వృత్తి చాలా గొప్పదని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో డ్రైవర్స్ డేను జరుపుకున్నారు. డ్రైవర్లకు ఆర్టీసీ ఆర్ఎం. విజయ భాను, అధికారులు పూలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ డ్రైవరే అన్నారు. ఇందులో బేధాభిప్రాయాలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) ఎం.మాధవరావు, డిపో మేనేజర్‌లు వంగల మోహన్ రావు, బి.ధరమ్ సింగ్, సూపర్ వైజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష

వరంగల్ లీగల్: వరంగల్ నగరంలోని శివసాయి మందిరం పూజారి సత్యనారాయణ శర్మ హత్యకేసులో నేరస్తుడు సయ్యద్ నాదిక్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2018, అక్టోబర్ 26 ఉదయం 5.30గంటలకు పోచమ్మ మైదాన్ సెంటర్‌లోని శివసాయి మందిరం పూజారి సత్యనారాయణ శర్మ హారతి కార్యక్రమాన్ని మైక్ ద్వారా వినిపిస్తుండగా సయ్యద్ నాదిక్ హుస్సేన్ అక్కడికి వచ్చి తమకు అసౌకర్యంగా ఉందని, మైక్ ఎందుకు పెట్టావని అకారణంగా పూజారిపై దాడిచేసి గాయపర్చాడు. తీవ్ర గాయాల పాలై రక్తపు మడుగులో ఉన్న సత్యనారాయణ శర్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నాలుగు రోజుల అనంతరం పూజారి మృతి చెందారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నాటి ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి పరిశోధన చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 30 మంది సాక్షుల సాక్ష్యాధారాలను కోర్టు విచారించి నేరం రుజువు కావడంతో నేరస్తుడు సయ్యద్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జి నిర్మలా గీతాంబ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రత్యేక ప్రాసిక్యూటర్ మోకాళ్ల సత్యనారాయణ, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ పక్షాన వాదించారు. లైజన్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుళ్లు దాడి శ్రీనివాస్, రఘు కోర్టులో ప్రవేశపెట్టారు.

భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలి

● మేడారం మినీజాతర ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క, పక్కన మంత్రి సురేఖ, ఎంపీ, తదితరులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క, సాలరమ్మ మినీ జాతరలో భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వచ్చేనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ జాతర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు రాష్ట పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, డీఎఫ్‌ఓ కిషన్ రాహుల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఏర్పాట్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మినీ జాతరతో పాటు 2026లో జరగనున్న మహాజాతర నాటికి శాశ్వత పనుల కోసం రూ.50 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. కొండాయి బ్రిడ్జి కోసం గతంలో రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశామని, ఇంజనీరింగ్ అధికారులు మరో రూ.16 కోట్ల అంచనా పెంచారని, త్వరలో నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన మళ్లీ జాతర పనులపై సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు.

శాఖల వారీగా సమీక్ష

ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, విద్యుత్, ఇరిగేషన్, వైద్య, పీఆర్ శాఖల అధికారుల ఏర్పాట్లపై ప్రధానంగా సమీక్షించారు. జాతరలో నాలుగు రోజుల పాటు జంపన్నవాగులో భక్తుల స్నానాల కోసం నీటి పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు అడగగా పడిగాపూర్ చెక్‌డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతరలో చేపట్టాల్సిన బందోబస్తు, భద్రత ఏర్పాట్లను మంత్రులకు జిల్లా ఎస్పీ శబరీష్ వివరించారు. తాగునీటి ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. సమావేశానికి ముందు మంత్రులు సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్.. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.

కొండాయి బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభిస్తాం

● ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్

సాక్షి ఎఫెక్ట్..

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి - దొడ్ల మధ్యలో ఉన్న నూతన బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన సాక్షిలో వచ్చిన కొండాయి బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో? అనే కథనంపై అధికారులు స్పందించారు. వరదలకు గతంలో వేసిన బ్రిడ్జి కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. లోలెవల్‌లో కాకుండా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ చేయించడంతో ఆలస్యంగా అయిందని తెలిపారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి వర్షాకాలంలోపు పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. మేడారం జంపన్నవాగుపై నిర్మించిన నమూనా లాంటిదే ఇక్కడ కూడా నిర్మించాలని మంత్రి సీతక్క ఆదేశించారని గుర్తుచేశారు. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం.

69 ఏళ్ల చరిత్ర తెరమరుగు

వేల మందిని తీర్చిదిద్దిన చదువులమ్మ ఒడి తొలగింపు


కురవి హైస్కూల్ భవన సముదాయాన్ని కూల్చివేస్తున్న కూలీలు


కూల్చిన భవన శిథిలాలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న డ్రైవర్

కురవి: మండల కేంద్రంలో 69 ఏళ్ల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇక తెరమరుగు కానుంది. శిథిలమైన చదువులమ్మ ఒడి (బడి)ని తొలగించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఏళ్ల చరిత్ర కలిగి వేలాది మందిని ఉన్నతంగా తీర్చిదిద్దిన సరస్వతి నిలయంలో శుక్రవారం కూల్చివేత పనులు మొదలు పెట్టారు. 1956లో ఈ పాఠశాలను అగ్రికల్చర్ రిహాబిలిటేషన్ మంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించారు. ఇక్కడ చదివిన కొందరు విదేశాల్లో స్థిరపడగా, మరికొందరు మావోలుగా మారి అడవిబాట పట్టి అమరులయ్యారు. ఇంకొందరు మంచి హోదాలో ఉన్నారు. తమ బడి కూలిపోతోందని తెలిసిన పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.